ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల 5
జిల్లా వార్తలు
సోమవారం 1 డిసెంబరు 2025



రైతుల్లో కలవరం



మూడురాళ్లపల్లె గ్రామ సమీపంలో నెలకొరిగిన వరి పంట



చాగలమర్రి సర్వీసు రహదారిలో మొక్కజొన్న ధాన్యం పట్టలపై నిలిచిన వర్షపు నీరు

- పంటలపై దిత్వా తుఫాన్ ప్రభావం
- నేలకొరిగిన వరి పంటలు
- తడిసిన మొక్కజొన్న, మినుము పంటలు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులను తుఫానులు వెంటాడుతున్నాయి. మొన్నటి మొంథా నష్టం నుంచి తేరుకోకముందే దిత్వా తరుముకొచ్చింది. చాగలమర్రి మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని ఎం.తాండ, కేపీ తాండ, ఓజీ తాండ, మూడురాళ్లపల్లె గ్రామాల సమీపంలో కోతదశలో ఉన్న వరి పంట నేలవాలింది. కోత కోసి ఆరబెట్టుకున్న మొక్కజొన్న, మినుము ధాన్యం తడిసి దెబ్బతినింది. కోత దశకు వచ్చిన కందిపంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముత్యాలపాడు, శెట్టివీడు, గొడిగనూరు, మద్దూరు, చిన్నబోదనం, చాగలమర్రి సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిసి దెబ్బతినింది. చింతలచెరువు, మల్లేవేముల తదితర గ్రామాల్లో కోత కోసిన మినుము, పెసర పంట కుప్పలు తడిసి దెబ్బతిన్నాయి. ధాన్యం రంగుమారితే వ్యాపారులు కొనడానికి ముందుకు రారని రైతులు విలపిస్తున్నారు. అసలే ధరలు లేక, దిగుబడి రాక నష్టపోతుంటే తుఫాన్‌లతో భారీగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

చేతికొచ్చిన పంటలు ఏమవుతాయో..

రైతుల్లో అలజడి



అవుకులో వరి ధాన్యంపై పట్టాలు కప్పి కాపాడుకుంటున్న రైతులు



రుద్రవరం సమీపంలో..

అవుకు, రుద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో మేఘాలు కమ్ముకొని ఆదివారం అవుకు, రుద్రవరం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవలి వర్షాలకు రిజర్వాయర్‌కు పుష్కలంగా నీరు చేరటంతో మండలంలోని రైతులు ఖరీఫ్‌లో వరి పంటను 13,330 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వరి పంట కోత దశకు చేరుకోగా, మరికొన్ని గ్రామాల్లోని రైతులు ఇప్పటికే వరి పంటను కోసి పొలాల్లో, రోడ్డు పక్కల నిల్వ చేశారు. ఈ దశలో మరో తుఫాను దిత్వా వల్ల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. వానలకు తడిస్తే ధాన్యం రంగు మారుతుందని, ధర పడిపోతుందని అంటున్నారు.

తుఫాన్ దిగులు

- వరి రైతుల గుండెల్లో రైళ్లు
- ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి పంట

కొలిమిగుండ్ల: దిత్వా తుఫాన్ ఏపీ వైపు దూసుకొస్తోందన్న సమాచారంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తుఫాను ప్రభావంతో రెండు రోజుల పాటు జిల్లాలోని విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అన్నదాతలు గుండెల్లో గుబులు మొదలైంది. మొంథా తుఫాన్ జిల్లాలో మొక్కజొన్న రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. ఈగండం నుంచి గట్టెక్కేలోపే దిత్వా తుఫాన్ దూసుకరావడం రైతులను కోలుకోలేకుండా చేస్తోందని వాపోతున్నారు.

జిల్లాలో విస్తారంగా వరి సాగు

జిల్లాలో విస్తారంగా సాగుచేసిన వరి సాగుపై దిత్వా ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. విస్తారంగా వర్షాలు కురిసి, భూగర్భజలాలు పెరగడంతో రైతులు బోరు బావులు, కాలువలు, ప్రాజెక్టుల కింద వరి పెద్ద ఎత్తున సాగుచేశారు. జిల్లా వరి సాధారణ సాగు 65,255 హెక్టార్లు కాగా, 73,038 హెక్టార్లలో రైతులు వరి సాగు చేసినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. వరి ప్రస్తుతం కోత దశలో ఉంది. తుఫాన్ ప్రభావం వరి పైనే తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు, బనగానపల్లె ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో వరి కోత కోసి, దిగుబడిని నిల్వ చేసుకున్నారు. ఈపరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూర్పిడి చేసి వరి తడిసి పోవడంతో పాటు, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పడిపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.



ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు

ఎగ్‌బాకుతోంది..!

- పది రోజుల్లోనే డజనుపై రూ.30 పెరుగుదల
- రిటైల్ మార్కెట్లో రూ.10కు చేరిన గుడ్డు ధర
- మరింత పెరుగుతాయంటున్న వ్యాపారులు



కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. పది రోజుల వ్యవధిలోనే డజను గుడ్లపై ఏకంగా రూ.30 పెరగడంతో వినియోగదారులు హడలెత్తిపోతున్నారు. ఈనెల ప్రారంభంలో రిటైల్ మార్కెట్లో రూ.6, రూ.6.50 ఉన్న గుడ్డు ధర కొద్ది రోజుల వ్యవధిలోనే రూ.10కి చేరింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ కోడ్డి గుడ్డు తీసుకోవడంతో మనిషి ఆరోగ్యంగా ఉంటారని ఓవైపు వైద్యులు సూచిస్తుంటే, కోడిగుడ్లు కొనాలంటేనే భయమేస్తోందని ప్రజలు వాపోతున్నారు. చలికాలం కావడం, కార్తీక మాసం ముగియడంతో కొద్ది రోజులుగా మార్కెట్లో కోడి గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. సామాన్య ప్రజలు మొదలుకొని, ఉన్నత స్థాయి వర్గాల వరకు ప్రతి ఒక్కరూ, వారంలో ఐదారు రోజులు గుడ్డు తినడానికి ఇష్టపడుతున్నారు. మరోవైపు సాయంత్రం అయితే చాలు పల్లెలూ, పట్టణాలు అన్న తేడా లేకుండా తోపుడుబండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 1.50లక్షల వరకు కోడిగుడ్లు వినియోగం జరుగుతున్నట్టు వ్యాపార వర్గాల అంచనా. త్వరలో కోడిగుడ్డు ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సిరుల జాజి

- కేజీ రూ.1,000
- ఆనందలో రైతన్నలు



చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగిసినా జాజి పూలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. వారం కింద జాజి పూలు రూ.200 పలకాయి. ఆదివారం జాజిపూలు రూ.1000, మల్లెలు రూ.800, కాగడ రూ.600, కనకాంబరి రూ.700 చేరాయి. దిగుబడి కూడా తక్కువగా ఉండటంతో జాజి, మల్లె ధరలు ఒక్కసారిగా ఆకాశన్నంటాయి. గతంలో ఎకరాకు జాజిపూలు 50 నుంచి 100 కేజీలు వచ్చేవి. ప్రస్తుతం ఎకరాకు 5 నుంచి 30 కేజీలు మాత్రమే వస్తున్నాయి. దిగుబడి భారీగా తగ్గడంతో పూలకు డిమాండ్ పెరిగి అమాంతంగా ధర పెరిగిందని రైతులు చెబుతున్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన మాబుహుసేన్, బాష, షరీఫ్, మరి కొందరు రైతులు జాజిపూల సాగులో ఆదర్శంగా నిలిచారు. కష్టానికి తగ్గ ఫలితం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార దశను తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

శాంతి భద్రతల కోసమే కార్డన్ సెర్చ్

- ఎస్పీ సునీల్ షెరాన్



వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నంద్యాల టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆదివారం జిల్లాలోని ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో అవుకు, నంద్యాల తాలుకా, నందివర్గం, మిడ్తూరు, నందికొట్కూర్ రూరల్, ఆత్మకూరు పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈతనిఖీల్లో 15వాహనాలు, 85 మద్యం బాటిళ్లు, 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు. అయితే నంద్యాలలో గంజాయి కూడా దొరికినట్లు సమాచారం.

మంచి ప్రవర్తనతో మెలగాలి

నేర చరిత్ర గల వ్యక్తులు, రౌడీ షీటర్లు సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలన్ని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర ప్రవృత్తికి స్వస్తిపలికి సమాజంలో గౌరవించాలన్నారు.

బాసర తరహాలో కొలనుభారతి అభివృద్ధి

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- భక్తులకు మెరుగైన సేవలు
- శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రాన్ని బాసర తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావుతో కలిసి కొలనుభారతి క్షేత్రాన్ని సందర్శించారు. వీరికి ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర అభివృద్దిని దృష్టిలో ఉంచుకుని కొలనుభారతిని శ్రీశైలంలో విలీనం చేసేందుకు ప్రత్యేక జీవో తీసుకొచ్చామన్నారు. అభివృద్ధి కోసం సీజీఎస్ కింద రూ.1.20కోట్ల నిధులు కూడా ఇప్పటికే మంజూరు అయ్యాయన్నారు. అంతేగాకుండా శివపురం గూడెం నుంచి క్షేత్రం వరకు రహదారి, చారుఘోష నది పునర్నిర్మాణం, ప్రత్యేక అక్షరాభ్యాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కొలనుభారతిని ప్రభుత్వం అధికారికంగా శ్రీశైలంలో విలీనం చేయడంతో రాబోయే రోజుల్లో క్షేత్రంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. కొలనుభారతి విశిష్టతను తెలిపేందుకు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. శ్రీశైలం నుంచి కూడా క్షేత్రానికి వేద పండితులు వస్తారని, స్థానిక పురోహితులు కూడా ఉంటారనీ స్పష్టంచేశారు. కార్యక్ర మంలో ఈవో రామలింగారెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకటనాయుడు, కొత్తపల్లి, పగిడ్యాల మండల కన్వీనర్లు లింగస్వామి గౌడు, మహేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు మల్లారెడ్డి, రఫీ, జడ్.వెంకటరెడ్డి, స్వామిరెడ్డి, శివారెడ్డి, బుచ్చిరెడ్డి, దేవాదాయ శాఖ అధికారి రామసుబ్బయ్య, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల క్షేత్రంలో దళారులను నమ్మి భక్తులు మోసపోవద్దని శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామిఅమ్మవార్ల ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు తమకు కావలసిన ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం దేవస్థానం వెబ్‌సైట్‌లో స్వామివారి స్పర్శ దర్శనం టికెట్ మినహా 17 విధాలుగా స్వామిఅమ్మవార్ల ఆర్జిత సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వసతి గదుల వివరాలు కూడా దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్, దేవస్థానం నిర్వహించే వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు. మనమిత్ర వాట్సప్ ద్వారా కూడా శీఘ్ర, అతిశీఘ్ర, స్పర్శ దర్శనాలను పొందవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్నవారు తమ ఆధార్ కాపీలను తప్పనిసరిగా స్కానింగ్ సమయంలో చూపాలన్నారు. శ్రీశైలానికి వచ్చే భక్తులకుఉచిత లడ్డూ ప్రసాదాలు అందించేందుకు సోమవారం 9, 10 కౌంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు.

శ్రీగిరిపై భక్తుల సందడి

ఆది దంపతులకు కళా నీరాజనాలు

శ్రీశైలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం భక్తుల తాకిడితో సందడిగా మారింది. ఆదివారం తెల్లవారుజాము నుండి పాతాళ గంగలో పుణ్య స్నానాలు చేసుకుని తలనీలాలు మొక్కులుగా సమర్పించుకున్నారు. ఉభయ దేవాలయాల దర్శనాల కోసం సర్వ దర్శనం భక్తులకు నాలుగు గంటల సమయం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలకు రెండు గంటలు, స్పర్శ దర్శనం వీఐపీ బ్రేక్ టిక్కెట్ పొందినవారికి గంట సమయం పట్టిందని ఆలయ అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలోని ఉద్యానవనాలు, శివాజీ స్ఫూర్తికేంద్రం, రుద్రపార్కులు చిన్నారుల ఆటపాటలతో కిటకిటలాడాయి. కళారాధన వేదికపై సంప్రదాయ నృత్యాలు, భజన గీతాలతో స్వామి అమ్మవార్లకు కళానీరాజనాలు సమర్పించారు.



స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వేచిఉన్న భక్తులు



శ్రీశైల భ్రమరాంబకు పూజలు చేస్తున్న అర్చకులు

భ్రమరాంబకు పల్లకీ సేవ

శ్రీశైల భ్రమరాంబ అమ్మవారికి ఆదివారం సాయంత్రం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వార పూజల్లో భాగంగా పుష్పాలంకరణ చేసిన పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఆసీనులను చేసి పల్లకిలో ఊరేగించారు.

యథేచ్ఛగా బెల్టు షాపులు



నంద్యాల జిల్లా ఎక్సైజ్ కార్యాలయం

నంద్యాల టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టు షాపుల నిర్వహణ యథేచ్ఛగా కొనసాగుతోంది. కొంత మంది నాయకుల అండదండలు, అధికారుల అలుసుతో మామూళ్లు ముట్టజెప్పుతూ గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం వినియోగదారుల నుంచి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదంతా చూస్తున్న అధికారులు నామమాత్రంగా కేసులు రాసి వదిలేసి పట్టించుకోవడం లేదు.

ఒక్కో మద్యం దుకాణం పరిధిలో..

నంద్యాల జిల్లాలో సుమారుగా 105 మద్యం దుకాణాలు, 25 వరకు బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. మద్యం దుకాణాల పరిధిలో ఇష్టానుసారంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌పై రూ.30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. జిల్లాలో సుమారుగా ఒక్కో మద్యం దుకాణం పరిధిలో 7నుంచి 10 వరకు బెల్టు షాపులున్నాయి. కొన్ని మండలాల్లో గొలుసు దుకాణాల వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులకు అనుమానం రాకుండా అరకొర కేసులు రాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో కొన్ని ఘటనలు....

- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మద్యం దుకాణాల్లో ఉదయం 10 గంటలలోపు కూడా అమ్ముకోవడానికి అధికారులకు నెలకు రూ.30వేల వరకు మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం.
- నంద్యాలలో బెల్టుషాపులు తక్కువగా ఉన్న బార్లలో తెరవకూడని సమయాల్లో అమ్ముకోవడానికి, మమూలు మద్యం దుకాణాల్లో ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకు అమ్ముకోడానికి అధికారులకు రూ.40వేలు ముట్టజెప్పుతున్నట్లు విమర్శలు న్నాయి.
- కొన్ని గ్రామాల్లో గొలుసు దుకాణాలు నడుపుకోవడానికి డబ్బు చెల్లిస్తున్నట్లు సమాచారం.

» నామమాత్రంగా కేసులు రాస్తున్న ఎక్సైజ్ శాఖ

నిఘా పెంచి అరికడతాం



జిల్లాలో ప్రతి చోట కేసులు రాస్తున్నాం. గ్రామాల్లో ఇంకా నిఘా పెంచి చర్యలు తీసుకుంటాం. మద్యాన్ని ఎక్కడా ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మకూడదు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నంద్యాల

ఇద్దరు జేఏవోల బదిలీ

- చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనుమతి లేదని అలజడి
- కర్నూలు విద్యుత్‌శాఖలో రహస్య ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా బ్యాన్ సమయంలో బదిలీలు
- ఉద్యోగ సంఘాల్లో అసంతృప్తి



కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏపీ ఎస్‌పీడీసీఎల్ సర్కిల్లో సెప్టెంబరులో ఆకస్మత్తుగా జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు కలకలం రేపుతున్నాయి. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా పరిపాలనాపరమైన కారణాలను సాకుగా చూపిస్తూ ఇద్దరు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లను ఒకరినొకరి స్థానంలోకి మార్చుతూ అప్పటి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఉత్తర్వులు జారీచేయడం సంచలనంగా మారింది. కర్నూలు సర్కిల్ లోనే ఉత్తర్వులు అకస్మాత్తుగా రావడంతో ఏం జరిగిందీ, ఎందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకుల మధ్య జోరుగా చర్చలు సాగుతున్నాయి. పదోన్నతిపై వెళుతున్న సదరు ఉన్నతాధికారి జిల్లాలో ఇష్టారీతిన బదిలీలు, ఆపరేటర్ పోస్టులు, ఉద్యోగులకు ఇచ్చిన శిక్షను తగ్గించేలా నిర్ణయాలు చేశారనే తీవ్ర ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం ఆధ్వర్యంలో జనరల్ బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబరు-23, తేది:15-5-2025న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి జనరల్ ట్రాన్స్‌ఫర్లకు అనుమతి ఇచ్చింది. ఈమేరకు పాత నిషేధ ఉత్తర్వులో మినహాయింపుగా 16 మే 2025 నుండి 2 జూన్ 2025 వరకు బదిలీలు చేపట్టడానికి అనుమతి ఇచ్చింది. ఆ ప్రకారం అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఆపై బదిలీలు చేయాల్సి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతితో పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు చేయాలి.



సీఎండీ రెఫరెన్స్ లేకుండా గత ఎస్ఈ ఇచ్చిన జేఏవోల బదిలీ ఆర్డరు

విద్యుత్‌శాఖలో అందుకు విరుద్ధంగా బదిలీలు

విద్యుత్‌శాఖలో నిబంధనలకు విరుద్ధంగా గతంలో కర్నూలు ఎస్ఈగా పని చేసిన ఉన్నతాధికారి 12 సెప్టెంబరు 2025లో అర్ధరాత్రి ఆర్డర్లు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇష్టారీతిన కర్నూలు సర్కిల్లోని ఇద్దరు జేఏవోలు పి. వెంకటరాఘవను జేఏవో అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎంఆర్‌టీ డివిజన్ కర్నూలుకు, ఎం. విజేంద్రచారిని ఎంఆర్‌టీ డివిజన్ నుండి కర్నూలు అడ్మినిస్ట్రేషన్‌కు బ్యాన్(బదిలీల నిషేధం) సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీ ఆర్డర్లు ఇవ్వడంపై అభ్యంతరాలు వచ్చాయి. ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి కార్యాలయం రెఫరెన్స్(అనుమతి) లేకుండా ఎస్ఈ హోదాలో నేరుగా జేఏవోలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చి గోప్యంగా ఉంచడంపై విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. డిస్కం పరిధిలో ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ పాలసీ మేరకు బదిలీ ఆర్డర్లు



ఉద్యోగుల బదిలీలు ట్రాన్స్‌ఫర్ల పాలసీకి లోబడి చేయాల్సి ఉంటుంది. గైడ్‌లైన్స్‌ను అతిక్రమించి ఆర్డర్లు ఇస్తే ఇతర ఉద్యోగుల నుండి కొంత ఒత్తిడి ఉంటుంది. బ్యాన్ సమయంలో పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు ఇవ్వవలసి వస్తే తప్పకుండా ఏపీ ఎస్పీడీసీఎల్ (డిస్కం) సీఎండీ, ఉన్నతాదికారుల అనుమతి కచ్చితంగా తీసుకోవాలి.

-ఆర్. ప్రదీప్‌కుమార్, కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ

పదోన్నతిపై వెళుతూ పందేరం

పదోన్నతిపై వెళుతున్న ఆ ఎస్ఈ తనకు అనుకూలంగా ఉన్నవారిపై వల్లమాలిన ప్రేమ కురిపించారని ఆరోపణలున్నాయి. ఉద్యోగుల బదిలీలు, ఆపరేటర్ పోస్టులు, విధుల్లో అలసత్వం వహించినందుకు చర్యలు తీసుకున్న ఉద్యోగులకు మేలు చేసేలా నిర్ణయాలు అనేకం చేసినట్లు విమర్శలున్నాయి.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ బలవన్మరణం

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ బలవన ర్మణానికి పాల్పడింది. ఈఘటన కోవెలకుంట్ల రైల్వేస్టేషను పరిధిలో చోటుచేసుకున్నట్లు నం ద్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. వివరాలు.. అమడాల మెట్ట సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని మహిళ రైలు కిందపడి మృతి చెందింది. ఈమె వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయి. నలుపు ఎరుపు గోల్డ్ కలర్ చెక్స్ కలిగిన చీర, జాకెట్, కలిగి ఉందని, ఎత్తు 5 సెంటీమీటర్లు ఉంటుంది. ఈమె రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగన్న ఘటనాస్థలికి చేరుకున్నారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు 99088 89696 రైల్వే సీఐ నెంబరును సంప్రదించాలని, రైల్వే ఎస్ఐ 8367037525 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడు దుర్మరణం

నెహ్రూనగర్‌లో విషాదం



చేతన్(ఫైల్)

పగిడ్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కిందపడి 14నెలల బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నెహ్రూనగర్‌లో చోటుచేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన గొడుగు శంకరయ్య, లావణ్య లకు చేతన్(14నెలలు) సంతానం. వీరు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిం చేవారు. ఆదివారం ఉదయం తండ్రి పొలం పనులకు వెళ్లగా తల్లి ఇంటి పనుల్లో నిమగ్న మైంది. బాలుడు తమ ఇంటి సమీపంలోని బంధువుల ఇంట్లో అడుకునేందుకు వెళ్లాడు. వారి ఇంటికి ఎదురుగా ఉన్న గొడుగు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం కర్నూలు నుంచి ఏపీ 21 టీటీ 9588 నెంబరు గల ట్రాక్టర్‌లో సిమెంట్ ఇటుకలను తీసుకొచ్చారు. ఇటుకలను అన్‌లోడింగ్ చేసి వెళ్తుండగా ఆడుకొని ఇంటికి వస్తున్న చేతన్ పై ట్రాక్టర్ వెళ్లింది. బాలుడి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవరు ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఇంట్లో సందడి చేసే ఒక్కగా నొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్ఐ నరేంద్రకు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవరు నిర్లక్ష్యం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని బాలుడి తల్లి లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య



మద్దయ్య(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్దుర్తి ఎస్ఐ నరేశ్ తెలి పిన వివరాలివీ.. వెల్దుర్తి మండలంలోని కలగొట్ల గ్రామానికి చెందిన మద్దయ్య(55) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మాన్యాన్ని కౌలుకు సాగు చేస్తున్నాడు. వ్యవసాయం కోసం సుమారు రూ.6 లక్షలు అప్పు చేశాడు. ఈ సంవత్సరం వేసిన మొక్కజొన్న పంట నష్టం రావడంతో బాగా కుంగిపోయాడు. అప్పులు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో ఆది వారం ఉదయం ఓ రైతు పొలంలో చెట్టుకు తాడుతో ఉరి వేసున్నాడు. రైతుకు కమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్దయ్య భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ప్యాపిలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్దప్రమాదం తప్పిపోయింది. బెంగుళూరు నుంచి బనగానపల్లి వైపునకు లారీ బయలుదేరింది. మార్గమధ్యలో రామక్రిష్ణాపురం దగ్గరకు రాగానే లారీ అదుపు తప్పి విద్యుత్ స్తం భాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. తీగలు తెగిపోవడంతో రాక్రిష్ణాపురం, మాధవరం గ్రామాలకు దాదాపు 3గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్‌శాఖ ఏఈ వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు జలదుర్గం పోలీసులు విచారణ చేపట్టారు.

కాంగ్రెస్ బలోపేతం దిశగా ప్రణాళిక

- డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం
- ఏఐసీసీ పరిశీలకుడు ఎమ్మెల్యే హారీశ్



మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే హరీశ్ తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే హరీశ్ అన్నారు ఆదివారం నంద్యాలలోని సూరజ్ గ్రాండ్ హోటల్లో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ యువత, నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తుం దన్నారు. డీసీసీ పదవుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర పరిశీలకుడు సుధాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో, జిల్లాల్లో నూతన నాయకత్వాన్ని ఎంపిక చేసుకోవ డానికి జిల్లాకు వచ్చామన్నారు. జిల్లాలో హరీష్ క్షేత్రస్థాయిలలో పర్యటించి కాంగ్రెస్ స్థితిగతులను పరిశీలిస్తారన్నారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి గణేశ్‌యాదవ్, ఏపీసీసీ ప్రధానకార్యదర్శి మూసాని శ్రీనివాసులురెడ్డి, కేకేసీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఏపీసీసీ కార్యదర్శి మోహన్‌రావ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ, నంద్యాల అసెంబ్లీకి పోటి చేసిన అభ్యర్థి గోకుల కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతలయ్యా, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జీ హుసేన్‌బాషా పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

బనగానపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని కొండపేటలో షేక్ రోహేన అను మహిళ తన వదిన షేక్ రజియాతో కలసి వ్యభిచారం చేస్తున్నట్లు సమాచారం అందింది. వ్యభిచార గృహంపై మహిళా ఎస్ఐ కల్పన ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి రెడ్‌హ్యాండెడ్‌గా ఇరువురు విటులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళ రజియా పరారైంది. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో గతనెల 28న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన క్రిష్ణంరాజు, లక్ష్మిదేవి దంపతుల కూతురు హైమావతి(21) కర్నూలులోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతుంది. మూడు రోజుల క్రితం మాధవరానికి విద్యార్థి వచ్చింది. అతల్లిదండ్రులు కూతురుకు పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు తెలిసింది. పెళ్లి ఇష్టం లేదని, చదువు పూర్తి కావాలని చెప్పిన తల్లిదండ్రులు పెడచెవినపెట్టారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హైమావతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు అపారస్మారక స్థితిలో ఉన్న ఆమెను ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నక్సల్స్ కదలికలపై పోలీసుల ఆరా!

- ఎర్రకోన కొండ ప్రాంతాలను పరిశీలించిన పోలీసులు



ఎర్రకోన ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఐలు రమేష్‌బాబు, హనుమంతునాయక్

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రకోన కొండ ప్రాంతాల్లో నక్సల్స్ కదలికలపై స్థానిక పోలీసులు ఆరాతీశారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, పలువురు ఎస్ఐలు, స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్ అధికారులు, పోలీసులు ఆయా గ్రామాల పరిధిలో పర్యటించారు. ఎర్రకోన కొండ ప్రాంతాల్లోని రైతులను, స్థానికులను కలిసి, సమాచారం సేకరించారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఎర్రకోన కొండ ప్రాంతానికి వచ్చి వెళ్లిన విషయాలపైన స్థానికులను కలిసి విచారణ చేపట్టారు. ఈసందర్భంగా కొత్త వారు తిరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులకు వివరించారు.

ర్యాగింగ్‌పై కలెక్టర్ ఆరా

- విద్యార్థికి ఫోన్ చేసి పరామర్శ
- ధైర్యంగా ఉండాలని సూచన



కర్నూలు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో ర్యాగింగ్ పరిణామాలపై కలెక్టర్ సిరి ఆరాతీశారు. బాధిత విద్యార్థికి ఫోన్‌చేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌లో దాడులు చేసి సిగరెట్‌తో కాల్చిన సీనియర్ విద్యార్థిపై వర్సిటీ అధికారులు కేవలం హాస్టల్ నుంచి సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. అతడు యథావిధిగా తరగతులకు హాజరవుతుండటంతో బాధిత విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దాడులకు పాల్పడిన విద్యార్థి కుల సంఘాల నాయకులను వెంటబెట్టుకుని క్యాంపస్‌లో మరోసారి బెదిరింపులకు పాల్పడం ఎంతవరకు సమంజసమని కొందరు విద్యార్థి నాయకులు మండి పడుతున్నారు. వర్సిటీకి చెందిన ఓ అధికారి, ఓ విద్యార్థి నేత దాడులకు పాల్పడిన విద్యార్థికి అండగా నిలవడంతో పాటు కుల సంఘాలను రెచ్చగొడుతూ క్యాంపస్‌లో అలజడి సృష్టించడమేమిటని కొందరు విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

రిజిస్ట్రార్‌ను తొలగించాలి

రిజిస్ట్రార్‌ను తొలగించే వరకు పోరాటం ఆగదు. విద్యార్థులు, ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరుకు కారణంమైన వ్యక్తిని ఉపకులపతి వెనుకేసు రావడం ఏమిటి? ర్యాగింగ్ పై చర్యలు తీసుకుంటే కుల సంఘాలను వర్సిటీలోకి పిలిపించి ఆందోళనలు చేపట్టడం ఎంత వరకు సమంజసం. పరిష్కరించాల్సిన అధికారులే సమస్యలకు ఆజ్యం పోయడం కరెక్టు కాదు.

-ఎస్ శరత్‌కుమార్,. జిల్లా సహాయ కార్యదర్శి ఏఐఎస్‌ఎఫ్

రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు

క్యాంపస్‌లో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. బీఈడీ కళాశాలల జిల్లాలో 49 ఉన్నాయి. అందులో భవనాలు లేకపోయినా14 కళాశాలలకు అనుమతులు ఎలా ఇస్తారంటూ ఆందోళనలు ఉధృతం చేసిన క్రమంలో విద్యార్థుల ర్యాగింగ్ కలకలం ఒక్కసారిగా వెలుగులోకి రావడంపై విద్యార్థి సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ఘనటలు తెరపైకి తెచ్చి విద్యార్థుల భవిష్యత్ తో అడకుంటారంటూ మండి పడుతున్నారు. రిజిస్ట్రార్, కొందరు ప్రొఫెసర్ల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో విద్యార్థులను బలితీయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాజా వరుస పరిణామాలను ఉన్నత విద్యా మండలికి కలెక్టర్ నివేదిక పంపడం.. ఆ నివేదికల ఆధారంగా సదరు వర్సిటీ ఉన్నతాధికారులను ఉన్నత విద్యామండలి మందలించనట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు.

చర్యలు తీసుకున్నాం

విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లిన మాట వాస్తవమే. ర్యాగింగ్ జరిగిందని చర్యలు తీసుకున్నాం. మరి కొందరు సస్పెన్షన్‌ఎత్తివేయాలని కోరడం ఎంత వరకు సమంజసం.

- వెంకట బసవరావు, ఉపకులపతి, ఆర్‌యూ

కలెక్టర్ ఫోన్ చేశారు

కలెక్టర్ ఫోన్‌చేశారు. మరోసారి పునరావృతమైతే నాదృష్టికి తీసుకురమ్మనారు.. జరిగిన సంఘటన అంతా అడిగి తెలుసుకున్నారు. జరిగిన ప్రతి అంశాన్ని కలెక్టర్‌కు వివరించాను.

- హరీశ్, బీఎస్సీ(ఫస్టియర్), ఆర్‌యూ

జాబ్ మేళాను వినియోగించుకోండి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



పోస్టరును ఆవిష్కరిస్తున్న మంత్రి భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ నియామకంతో పాటు మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 1350 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, యువత హజరయి ఉద్యోగాలు పొందాలని కోరారు.

'సైక్ సిద్ధార్థ' నటీనటుల సందడి

సీమ ప్రేక్షకుల ప్రేమ గొప్పది : నందు



కొండారెడ్డి బురుజు వద్ద నందు, యామిని

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నులు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద 'సైక్ సిద్ధార్థ' హీరో హీరోయిన్లు నందు, యామినీ భాస్కర్ సందడి చేశారు. డిసెంబరు 12న ఆ చిత్రం విడుదల సందర్భంగా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం వారు కర్నూలు విచ్చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద నందు అభిమానులతో సందడి నెలకొంది. హీరో హీరోయిన్లతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. అభిమానులతో హీరో నందు, హీరోయిన్ యామినీ భాస్కర్ సరదాగా ముచ్చటించారు. అనంతరం కిడ్స్ వరల్డ్ సమీపంలోని వెంకటేశ్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో నందు మాట్లాడుతూ తాను నిర్మాతగా, సహ నిర్మాతగా దగ్గుబాటి రాణా ఈ చిత్రం నిర్మించామని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై చిత్రం పూర్తి చేశామని తెలిపారు. చిత్రం హీరోయిన్ యామినీ భాస్కర్ మాట్లాడుతూ చక్కని కుటుంబ కథతోపాటు యువత మధ్య ప్రేమను కొత్తగా చూపారని తెలిపారు.

ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలి

- ఆర్‌యూ, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య వెంకట బసవరావు
- ఘనంగా 'దండెబోయిన బాలరంగయ్య-పాపులమ్మ' స్మారక పురస్కారోత్సవం



'దండెబోయిన' పురస్కారాన్ని సింధే రామమూర్తి దంపతులకు అందజేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు అన్నారు. ఆదివారం నగరంలోని బి. క్యాంపులోగల ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ (ప్రభుత్వ బీఎడ్ కళాశాల)లో దివంగత దండెబోయిన బాలరంగయ్య-పాపులమ్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ, ప్రభుత్వ బీఎడ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ వెంకట బసవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కళారూపాల్లో ఒకటైన తోలు బొమ్మలాట కళాకారులను గుర్తించి, వారికి ఈ పురస్కారం అందజేయడం అభినందనీమని చెప్పారు. క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కళలకు, సాహిత్యానికి గుర్తింపు ఉందని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ తెరచాటుకు మరలిపోతున్న కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత భవిష్యత్తు తరాలపై ఉందని చెప్పారు. . ఈ సమావేశంలో బీఎడ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మధుసూదన్, అఖిల భారత బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కోఆర్డినేటర్ హెచ్‌కే మనోహర్‌రావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా, లేపాక్షికి చెందిన సింధే రామమూర్తి, సావిత్రమ్మ దంపతులకు దండెబోయిన పురస్కారాన్ని డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, లక్ష్మయ్య, దండెబోయిన రమేష్ అందించి సన్మానించారు.

అలరించిన తోలుబొమ్మలాట ప్రదర్శన..

ఈ కార్యక్రమంలో భాగంగా సింధే రామమూర్తి బృందం ప్రదర్శించిన అత్యంత ప్రాచీన జానపద కళారూపం తోలు బొమ్మలాట అసాంతం ఆకట్టుకుంది. రామాయణ మహాకావ్యంలోని కిష్కింద కాండలోని హనుమంతుని లంకా పయనం ఘట్టాన్ని ఆద్యంత ఆకట్టుకునేలా కళాకారులు ప్రదర్శించారు.

మహానందిలో ప్రముఖుల పూజలు


మహానందిలో సివిల్ కోర్టు న్యాయాధికారి రమణారెడ్డిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు చేశారు. వీరిలో విజయవాడకు సివిల్ కోర్టు న్యాయాధికారి రమణారెడ్డి దంపతులు, తెలంగాణ రాష్ట్రం సైబరాబాద్‌కు చెందిన జాయింట్ సీపీ గజారాజ భూపాల్ ఆలయంలో వేర్వేరుగా స్వామి,అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిని కల్యాణమంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

దళిత ఉద్యోగికి న్యాయం చేయాలి


వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బంధువులు, ఎమ్మార్పీస్ నాయకులు

నంద్యాల టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బేనర్జీ డిమాండ్ చేశారు. ఆదివారం వన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్యోగి బంధువులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దళితవాడకు చెందిన రమేశ్‌బాబు ఎల్ఐసీ కార్యాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. సాటి ఉద్యోగులు అవమానాలకు గురి చేయడంతో శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇందుకు కారకులైన వారిని కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కలగజేసుకుని న్యాయం చేస్తామని చెప్పి పంపించారు.

అయ్యప్ప ఉత్సవమూర్తులకు జలాభిషేకం


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

పగిడ్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెహ్రూనగర్ సమీపంలోని కృష్ణ నదీలో అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో ఆరాట్టు(పవిత్రస్నానం) మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములు వందల సంఖ్యలో నందికొట్కూరు నుంచి ధర్మశాస్త్ర అయ్యప్ప ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నెహ్రూనగర్ సమీపంలోని కృష్ణానదికి చేరుకున్నారు. అక్కడ నదీస్నానం ఆచరించి ఉత్సవమూర్తులకు జలాభిషేకం, పూజలు నిర్వహించారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

ఆత్మకూరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ప్రతాప్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బిడుగు వెంకటరత్నం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా శేఖర్‌నాయక్, మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, మండల ప్రధానకార్యదర్శిగా బాలాజీ నాయక్, ఆర్థిక కార్యదర్శిగా రమాదేవి, సాంస్కృతిక కన్వీనర్‌గా బాలాజీ నాయక్, సహాయ కార్యదర్శిగా మహబూబ్‌బాషా, మండల కన్వీనర్‌గా లింగన్న, గౌరవ సలహాదారుగా పఠాన్ రఫీక్, మహిళా కార్యదర్శులుగా మల్లేశ్వరి, అంజనాదేవి, మైనార్టీ కన్వీనర్‌గా నూరుల్లా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, చంద్రకుమార్, రవీంద్ర, విజయ్‌కుమార్, జనార్దన్, వెంకటేష్ నాయక్, సురేష్ పాల్గొన్నారు.

ఏఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా రామచంద్ర రావు


ఎన్నికైన నంద్యాల డివిజన్ అసోసియేషన్ సభ్యులు

నంద్యాల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నంద్యాల డివిజన్ అధ్యక్షుడిగా నంద్యాల డిప్యూటీ తహసీల్దార్ రామచంద్ర రావు ఎన్నికయ్యారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని శాంతి భవన్‌లో నంద్యాల డివిజన్ ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఉయ్యాలవాడ ఎఫ్ఏసీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, కొత్తపల్లి డీటీ పెద్దన్న పాల్గొన్నారు. ఎన్నికల్లో అసోసియేషట్ అధ్యక్షుడిగా మాధవ, ఉపాధ్యక్షులుగా మహబూబ్‌బాషా, స్వప్న, యాసిన్‌బాషా, కార్యదర్శిగా చంద్రశేఖరయ్యతో పాటు మరో ఎనిమిది మంది ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మహేంద్ర కాలనీలో చోరీ

నంద్యాల టౌన్ , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతునగరం వద్దనున్న మహేంద్ర కాలనీలో ఆదివారం చోరీ జరిగినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. వివరాలిలా.. కాలనీకి చెందిన లీలావతి ఇంటికి తాళం వేసి పట్టణంలోని బంధువు ఇంటికి వచ్చారు. ఇదే అదునుగా గుర్తించిన దుండగులు తాళం పగలకొట్టి ఇంట్లోకి చొరబడి రూ.70 వేల నగదు, 2 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు పికప్ అనకట్ట వద్దకు గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కుందూనది, కేసీ కెనాల్ సంగమం ఆనకట్ట వద్ద ఆదివారం మధ్యాహ్నం మత్స్యకారులకు వ్యక్తి మృతదేహం కనిపించింది. దాంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈతగాళ్లను రప్పించి మృతదేహం వెలికితీసేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు

- ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు
- దిత్వా తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన
- చినుకుపడితే ధాన్యం రంగు మారే ప్రమాదం


కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు


ధాన్యంపై పట్టలు కప్పిన రైతులు

గడివేముల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్‌లు రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. మొంథా తుఫాన్ మరువక ముందే దిత్వా తుఫాన్ రావడంతో రైతులు కలవరపడుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను, కలాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఐదు వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు ధాన్యం కలాల్లో ఆరబోశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలవాలి తీవ్రంగా నష్టం వస్తుందని, కలాల్లో ఆరబోసిన ధాన్యం తడిస్తే గింజ రంగుమారుతుందని, ధర తగ్గి తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలోనని సతమతమవుతున్నారు. తుఫాన్ వల్ల నష్టం వాటిల్లితే ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బండిఆత్మకూరు/పాములపాడు : ఆరుగాలం శ్రమించి, పెట్టుబడులు పెట్టి ధాన్యం ఇంటికొచ్చే వేళ అన్నదాతకు దిత్వా తుఫాన్ దడ పట్టుకుంది. రెండు రోజులుగా ఆకాశమంతా మేఘాలు కమ్మి ఎప్పుడు వాన పడుతుందా అన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. మబ్బులు కమ్మటంతో ఏ క్షణం ఏమవుతుందో తెలియని భయం అన్నదాతలను పట్టిపీడిస్తోంది.

కల్లాల్లో వరి ధాన్యం



ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. పంట కోసం ధాన్యాన్ని కల్లంలో ఆరబోశాను. తుఫాన్ వల్ల గింజ తడిచి రంగుమారే ప్రమాదం ఉంది. వరుస తుఫాన్‌లతో తీవ్రపోతున్నాం.

● రసూల్‌బాషా, రైతు, గడివేముల

అప్రమత్తంగా ఉండండి



దిత్వా తుఫాన్‌కు పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కలాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా పట్టలు కప్పుకోవాలి. వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటిస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.

● పవన్‌కుమార్, ఏవో, గడివేముల


పాములపాడు: మొక్కజొన్న ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన రైతులు


బండిఆత్మకూరు : వరిధాన్యం కుప్పలపై పాలిథిన్ పట్టలు

ప్రతిరోజు భగవద్గీతను పఠించాలి

● భగవద్గీత ప్రచారకులు శ్రీమాన్ ప్రణవానంద దాస్

నంద్యాల కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు భగవద్గీతను పఠించడం అలవాటు చేసుకోవాలని భగవద్గీత ప్రచారకులు శ్రీమాన్ ప్రణవానందదాస్ ప్రభువు అన్నారు. ఆదివారం సాయంత్రం నంద్యాల టెక్కలోని యోగా సెంటర్‌లో ఇస్కాన్ నంద్యాల ఆధ్వర్యంలో గీతాజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య వక్తగా భగవద్గీత ప్రచారకులు ప్రణవానందదాస్ భగవద్గీత ప్రసంగం నిర్వహించారు. భగవద్గీతలోని 750శ్లోకాలు ఉన్నాయన్నారు. రోజూ రెండు శ్లోకాలు సంవత్సరం పాటు చదివితే మనలో అద్భుతమైన మార్పు వస్తుందన్నారు. మనకు ఏదైనా సమస్య వస్తే ప్రతి సమస్యకు భగవద్గీతలో సమాధానం దొరుకుతుందన్నారు.


ప్రసంగిస్తున్న ప్రణవానందదాస్


విద్యార్థిని దీప్తికి బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

పుస్తకానికి, ఫోన్‌కు వున్న వ్యత్యాసం గురించి వివరించారు. ప్రతి ఒక్కరు ఫలితం గురించి ఆలోచించకుండా నీ పని నీవు చేసుకుంటే వెళ్లే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఇస్కాన్ ప్రతినిధులు, రఘువంశీ ప్రభుజీ, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

భగవద్గీతను అధ్యాయం చేస్తే పరిపూర్ణ మానవుడిగా రూపుదిద్దుకుంటాడని గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అన్నారు. ఆదివారం గురురాజా పాఠశాలలో సంస్కృత శ్లోక పఠనం నందు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి దీప్తిని అభినందించారు. మరో తొమ్మిది ప్రత్యేక బహుమతులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వెలుగోడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వెలుగోడులోని పలు కాలనీల్లో రైతన్న మీ కోసం కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుడ్డా పాల్గొన్నారు. రైతులకు అందిస్తున్న పథకాలు అందుతున్నాయా.. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ క్రిష్ణారెడ్డి, మండ్ల శంకర్‌రెడ్డి, అబ్దుల్‌కలాం, మొమిన్‌రసూల్, ఎల్లా క్రిష్ణుడు, వీరభద్రుడు, మోతుకూరు సుధాకర్ రెడ్డి, జనసేన నాయకులు శాలుబాషా, బీజేపీ నాయకులు నాగేశ్వర రావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


రైతుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎన్నో సంస్కరణలు చేసిన వాజపేయికి భారతరత్న పురస్కారం లభించిందన్నారు. దేశ ప్రజలు ఆయనను గుర్తించేలా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో నంద్యాలలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించామని, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని వివరించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యుడు మురళీధర్, ఆడిటర్ గోపాల్, కశెట్టి కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, బ్రహ్మం, ఆదినారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాను అరెస్టు చేయాలి

నందికొట్కూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాకు చెందిన సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసిన వెళ్తున్న సీపీఎం నాయకుడు, ప్రజా నాట్యమండలి కళాకారుడు పెంచలయ్యను హత్య చేయడం దారుణమన్నారు. పెంచలయ్య హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు స్వాములు, గోపాలకృష్ణ, బెస్తరాజు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : నెల్లూరు నగరంలో డీవైఎఫ్ఐ నాయకులు, సీపీఎం కార్యకర్త పెంచలయ్యను హత్య చేసిన గంజాయి, డ్రగ్స్ ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ న్యాయవాది శంకరయ్య డిమాండ్ చేశారు. పెంచలయ్య హత్యను నిరసిస్తూ ఆదివారం రాత్రి పట్టణంలోని శ్రీనివాససెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటలింగం, కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ గౌస్, పుల్లా నరసింహ, పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, సుబ్బారావు, గోపాల్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సురేశ్, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నెల్లూరు డీవైఎఫ్ఐ నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన కిరాయి గుండాలను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు రణధీర్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు డాల్ వెంకటేశ్వర్లులు డిమాండ్ చేశారు. పెంచలయ్య హత్యను నిరసిస్తూ డివైఎఫ్ఐ నాయకులు, ప్రజా నాట్యమండలి నాయకులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి గౌడ్ సెంటరు వరకు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు సద్దాం హుసేన్, పౌర సమాఖ్య నాయకులు సురేంద్ర, కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి భాస్కర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు


ఆత్మకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్కౌట్స్ విద్యార్థులకు అభినందనలు


మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులు

పాణ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29 వతేదీన ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన 19వ జాతీయ జంబోరీ కార్యక్రమంలో పాణ్యం మోడల్ జూనియర్ కళాశాల స్కౌట్స్ విద్యార్థులు కెవి.వంశీధర్, ఎం. ధనుష్, డి. షెక్షావలి పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. ఆదివారం విద్యార్థులను స్కౌట్స్ మాస్టర్ కిరణ్‌కుమార్, కెప్టెన్ పర్వానాలను కళాశాల సిబ్బంది అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ జాతీయ వజ్రోత్సవాలు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిందన్నారు.

నంద్యాల కవులకు ప్రశంసలు


అవార్డులను అందుకున్న కవులు

నంద్యాల కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంత సాంస్కృతికోద్యమ వికాసంలో భాగంగా 'రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాలు' అనే అంశంపై జిల్లా పరిషత్ సెమినార్ హాల్ అనంతపురంలో నిర్వహించిన మహాకవి సమ్మేళనంలో నంద్యాల కవులు ప్రశంసలు అందుకున్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 9 వ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో నంద్యాల పట్టణ కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డా.కిషోర్ కుమార్,డా.నీలం వెంకటేశ్వర్లు, శేషఫణి, కొప్పుల ప్రసాద్, మాబుబాషా, తదితరులు కవితలు వినిపించారు. నిర్వాహకులు ఎ.హరినాథ రెడ్డి, ముఖ్యఅతిథి మాజీ ఉపకులపతి రామకృష్ణారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు బండి నారాయణస్వామి, శాంతి నారాయణ తదితరులు పాల్గొని కవులను సత్కరించారు. కవులను నంద్యాల సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ హయగ్రీవాచార్యులు, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ రవీంద్రనాథ్, శ్రీనివాసమూర్తి అభినందించారు.

కమ్యూనిస్టులను విమర్శించే అర్హత లేదు

● సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి పేరు చెప్పి ప్రజలను మోసగించే వారు కమ్యూనిస్టులను విమర్శించే అర్హత లేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయల డబ్బులను ముంచి బ్రతికే వారు కమ్యూనిస్టులను విమర్శించే హక్కు లేదన్నారు. మంత్రి పేరు చెప్పి భూకబ్జాలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు కాటేపోగు స్వామన్న, నరసింహుడు, ఏసన్న, వాడాల నాగేశ్వరరావు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నిజాయితీపరులకు అండగా ఏపీజీఈఏ


మాట్లాడుతున్న నరసరాజు

నందికొట్కూరు, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): నిజాయితీ గల అధికారుల పక్షాన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) నిలబడుతోందని ఆ సంఘం నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు నరసరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్డీవోపై నందికొట్కూరు తహసీల్దార్ అసభ్య పదజాలంతో దూషించిన వీడియో కొందరు స్వార్థపరుల పనేనన్నారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు కొందరు వ్యక్తులు కావాలనే లక్ష్యంగా చేసుకొని ఇలా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

పాములపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ సురేశ్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్రగూడూరు, జూటూరు గ్రామ శివార్లలోని హైవేపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ , కార్లు డ్రైవింగ్ చేసే వారు సీట్‌బెల్టు తప్పక ధరించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడల్లో రాణించాలి: సీఐ


విద్యార్థులకు బెల్టును ప్రదానం చేస్తున్న సీఐ రాము

ఆత్మకూరురూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ రాము సూచించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. సీఐ రాము విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో కూడా ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్నాయని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకునేందుకు క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సభ్యులు సయ్యద్ అసదుల్లా, వలిబాషా, అబ్దుల్ మజీద్,నాగన్న, స్టేడియం ఇన్‌చార్జి జునైద్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

వెలుగోడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు వికాస్, క్రిష్ణసాహితి, వెంకటమనోహర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాల ఆవరణలో వెలుగోడు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాల విష్ణ హాస్పిటల్ వైద్యులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అభిమన్యుడు ప్రారంభించారు. ఆనంతరం వైద్యులు రోగులను పరిశీలించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో 418 మంది పరీక్షించి చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు మండల పాత్రికేయులు సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. గడ్డి కొనలేం



చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం ధరలు మండిపోతున్నాయి. ఎండుగడ్డిని కొనే స్తోమత లేక రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. బోర్ల కింద సాగు చేసిన వరిగడ్డిని ట్రాక్టర్ రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు రేటుతో కొనుగోలు చేస్తున్నారు. కొందరు రైతులు పండించిన వరి గడ్డిని ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ రూ.15 వేలతో విక్రయిస్తున్నారు. బోర్ల కింద సాగు చేసిన పశుగ్రాసం కూడా తుఫాన్ వర్షాలతో దెబ్బతింది. పశుగ్రాసం లేకపోవడంతో పాల దిగుబడి కూడా తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం అందించాలని కోరుతున్నారు.

మినుముకు తెగులు

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మినుముకు బూడిద తెగులు సోకడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట ఆకులు తెల్లగా, బూడిద రంగులో మారతోంది. మరోవైపు ఆకులంతా చిల్లులు పడి పోతున్నాయి. మినుము పంట సాగు చేయడానికి మందులు, సాగు ఖర్చు, విత్తనాలు కలుపుకొని ఎకరాకు రూ.20వేలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. బూడిద తెగులు కారణంగా మినుము పంటను కోల్పోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు 322 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.


తెగుళ్లు సోకిన మినుము పంట

కందిపోతోంది..!


కందికి పిచికారీ చేస్తున్న రైతు

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంది పంటకు తెగుళ్ల బెడద తీవ్రమైంది. చేతికిచ్చిన పంట కళ్లెదురుగానే దెబ్బతింటుంటే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో దాదాపు 15 వేల ఎకరాల్లో రైతులు కంది పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడులు పెట్టి పంట వేశారు. ప్యాపిలి, కలచట్ల, పెద్దపూదిళ్ల, వెంగళాంపల్లి, ఏనుగమర్రి, వెంగళాంపల్లి, ఎర్రగుంట్లపల్లి గ్రామాల్లో కందిని పంటను సాగు చేశారు. పంటకు పూతలు బాగా వచ్చాయి. దీంతో రైతులు పంట బాగా వస్తుందని ఆశించారు. వాతవరణం ముసురు కోవడంతో కందికి తెగుళ్ల బెడద ఎక్కువైంది.

తాగునీటి కష్టాలు తీరవు!

రుద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. పాఠశాలలో 6 నుంచి 10 వరకు 370మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంటు మరమ్మతులకు నోచుకోలేదు.. మినీ వాటర్ ట్యాంకు నీళ్లే విద్యార్థులకు తాగునీరుగా మారింది. తాగునీటి సమస్య తీర్చాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హెచ్ఎం వెంకటరమణ మాట్లాడుతూ వాటర్‌ప్లాంటు మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం అని తెలిపారు.



అహోబిలంలో పీఠాధిపతి శతజయంతి వేడుకలు


స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో ఆదివారం అహోబిల మఠం 45వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప నారాయణ యతీంద్ర మహాదేశికన్ స్వామి శతజయంతి తిరు నక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి శ్రీప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మ వార్లుకు, శ్రీ జియర్ స్వామి వారి విగ్రహానికి తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకిలో ఉంచి ఆలయ ఆవరణంలో గ్రామొత్సవం నిర్వహించారు.

యాగంటి సన్నిధిలో జేసీ


యాగంటి క్షేత్రాన్ని దర్శించుకున్న జేసీ కార్తీక్ కుటుంబ సభ్యులు

బనగానపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని నంద్యాల జిల్లా జేసీ కార్తీక్ ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. జేసీ కార్తీక్ కుటుంబ సభ్యులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ పూజారులు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జేసీ దంపతులు ఉమామహేశ్వరస్వామిని, నందీశ్వరుడ్ని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అవుకు తహసీల్దారు మల్లిఖార్జునరెడ్డి, వీఆర్‌వో గోవిందప్ప పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


బేతంచెర్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఎవరైనా రౌడీషీటర్లు అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే.. తాట తీస్తామని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు సీఐ వెంకటేశ్వరరావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు అల్లర్లు, ఘర్షణలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కొలిమిగుండ్ల: క్షణికావేశంలో నేరాలకు పాల్పడితే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్థులకు సీఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

నేడు మంత్రి బీసీ సౌదరదిన్నెకు రాక

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండల పరిధిలోని సౌదరదిన్నె గ్రామానికి సోమవారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వస్తున్నట్లు మండల టీడీపీ యువ నాయకులు, కోవెలకుంట్ల సొసైటీ ఛైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

108 కళశాలతో క్షీరాభిషేకం ● బాలికలతో దీపోత్సవం


గణపతి హోమం చేస్తున్న అయ్యప్ప మాలదారులు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం వేద పండితులు ఆధ్వర్యంలో విళక్కిపడిపూజ, దీపోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గణపతిపూజ, గణపతిహోమం, 108 కళశములతో క్షీరాభిషేకం చేశారు. అయ్యప్ప మూలవిరాట్‌ను చందన అలంకారంతో కొలువుదీర్చారు. బాలికలచే దీపాలు చేతపట్టి అయ్యప్పదీక్షాదారులు భజన చేస్తూ అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం 18 మెట్లపై దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. కమిటీ సభ్యులు గురుస్వాములకు సన్మానం చేశారు. అయ్యప్పమాలదారులు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, గురుస్వాములు పాల్గొన్నారు.

గరీబ్ షావలి దర్గా ఉర్సు ప్రారంభం


గరీబ్‌షావలి దర్గా

బనగానపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని పాత ఆంధ్రాబ్యాంక్ సంతపంలో వెలసిన హజరత్ సయ్యద్ గరీబ్‌షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం గంధం ఉత్సవ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గంధం ఉత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉరుసు ఉత్సవాలు, 2వతేదీ మంగళవారం జియారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా కర్రెమ్మ దేవర

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోంచెర్వుపల్లి గ్రామంలో ఆదివారం కర్రెమ్మ అమ్మవారి దేవర కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి దేవరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, అలేబాదు పరమేష్, శ్రీరాములు, నాగరాజు, రాజశేఖర్‌నాయుడు, క్రిష్టయ్య, కాంతరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అవుకు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన బుర్ర పుల్లయ్య (36) అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలు మేరకు పుల్లయ్య తాగుడుకు బానిస కావటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. సహనం కోల్పోయిన భార్య హరిత పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన పుల్లయ్య గత నెల 29న ఇంటి వద్దనే పురుగు మందును తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ కోలుకోలేక మృతి చెందాడు. తండ్రి పెద్ద వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


బాధితుడితో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం గార్లదిన్నెలోని ఆయన నివాసానికి వెళ్లి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. సీఐ వెంకటరామిరెడ్డి, వై లక్ష్మీనారాయణ యాదవ్, సింగల్ విండో ఛైర్మేన్ సీమ సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాధవరంస్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెలుగులు


విద్యుత్ వెలుగుల్లో ఆలయం

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎట్టకేలకు తిరిగి వెలుగులు సంతరించుకున్నాయి. శనివారం ఆంధ్రజ్యోతిలో 'అంధకారంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం' అన్న శీర్షిక ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆదివారం తిరిగి విద్యుత్ పునరుద్ధరించారు.

గృహ నిర్మాణాల కోసం దరఖాస్తులు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎంఏవై కింద గృహ నిర్మాణాల కొరకు దరఖాస్తులు చేసుకోవచ్చని హౌసింగ్ ఏఈ నవీన్ తెలిపారు. ఆదివారం హౌసింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల కొరకు 500 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఇంటి స్థలాలు ఉండి గృహాలు నిర్మించుకొనుటకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం


వెల్లాల క్షేత్రంలో కమిటీ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధికి దాతలు రూ.84 వేలు దాతలు అందజేశారు. ఆదివారం కొరపాడుకు చెందిన దాత బాలిరెడ్డి రూ.21 వేలు, గోపాయపల్లెకు చెందిన సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డిరూ.21 వేలు, నంద్యాలకు చెందిన నరసింహారెడ్డి రూ.22 వేలు, అన్నవరానికి చెందిన వీరయ్య రూ.20 వేలు నగదును విరాలంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, ఈవో రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీనాయన ఆరాధనోత్సవం

చాగలమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో కాశీనాయనస్వామి ఆరాదన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కాశీనాయనస్వామి దీక్ష చేపట్టిన భక్తులు ఆయన విగ్రహంతో పురవీధుల గుండా గ్రామోత్సవం చేశారు. కాశీనాయనస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూగ జీవాలను ఆదరించాలి


గోమాతకు సపర్యలు చేస్తున్న సభ్యులు

డోన్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజోతి): మూగ జీవాల పట్ల ఆదరణ చూపాలని కేంద్ర గణేష్ మహోత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.హనుమంతరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కంబలపాడు సర్కిల్‌లో సంచరిస్తున్న గోమాత (ఆవు) గాయపడిన కాలితో కుంటుతూ సంచరిస్తుండగా.. వాటిని కొత్తకోట ఆచారి అనే వైద్యాధికారితో వైద్య చికిత్స చేయించి కాలికి గెట్టెలు వేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి సభ్యులు సీసం గుంతల మధు, గురుస్వామి, రామకృష్ణ, జగన్ ఉన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ఆర్థిక భరోసా

డోన్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ఆర్థిక భరోసా లభిస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం దొరపల్లి గ్రామంలో, పట్టణంలోని 13వ వార్డు 8వ సచివాలయం పరిధిలో పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సుదర్శన్


నూతన మండల కమిటీ నాయకులు

డోన్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ మండల కమిటి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సుదర్శన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ వెంకటసుబ్బారెడ్డి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.సుబ్బరాయుడు వ్యవహరించారు. సుదర్శన్‌తో పాటు కార్యదర్శిగా వీర మనోహర్, సహాధ్యక్షులుగా రామాంజనేయులు, నాయక్, శంషాద్ బేగం, ప్రధాన కార్యదర్శిగా ఆర్థిక కార్యదర్శిగా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు ఎన్ఎస్ బాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, గోపాల్, లతీఫ్, చంద్రశేఖర్ రెడ్డి, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: ఎస్టీయూ ఆధ్వర్యంలో కొత్తపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 79వ వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని మండల అధ్యక్షుడు ఓ.భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. యూటీఎఫ్ నాయకుడు ఎం.ఆజాంభేగ్, రాష్ట్ర కార్యదర్శి జేఎండీ ఇక్బాల్ బాషా మాట్లాడుతూ ఉపాధ్యాయుల అర్హత పరీక్ష నుంచి సీనియర్ ఉద్యోగులను మోసం చేస్తే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి రైతుల్లో నిరాశ

● ఎకరాకు 28 బస్తాలే దిగుబడి

● 78 కేజీల వరి ధాన్యం బస్తా రూ.1,500


రుద్రవరం మండలం వెలగపల్లెలో వరి కోత కోస్తున్న మిషన్

రుద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరి రైతులకు నిరాశే మిగిలింది. రుద్రవరం మండలంలో 24,200 ఎకరాలు వరిపంటను మూడు విడతల్లో రైతులు సాగు చేశారు. ఎంతో ఆశతో సాగు చేస్తే పుడమి తల్లి నిరాశ మిగిల్చింది. రైతుకు ప్రకృతి వర్షం రూపంలో దాడిచేసింది. నంద్యాల సోనా రకం వ్యవసాయ బోరుబావులు, కాల్వల కింద సాగు చేశారు. ఎకరాకు 40బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 28బస్తాలే దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. కౌలు రూపంలో రూ.15వేలు. పెట్టుబడి కింద రూ.30వేలు పెట్టుబడి పెట్టాం. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కౌలు రైతులు నష్టపోయారు. 78 కేజీల బస్తా వరి ధాన్యం రూ.1500 రేటు పలికింది.

రూ. 30వేలు పెట్టుబడి పెట్టా



పదెకరాలను కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశా. ఎకరాకు కర్నూలు సోనా రకం (బాతుముత్యాలు) 28 బస్తాలే దిగుబడి వచ్చాయి. ఎకరాకు రూ.15వేలు కౌలు చెల్లించా. రూ. 30వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను.

● సుధాకర్‌రెడ్డి, కౌలు రైతు, రుద్రవరం

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. రైతులు, కౌలు రైతులు దిగుబడి తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్లో 78 కేజీల బస్తాల వరి ధాన్యం కేవలం రూ.1500 మాత్రమే రేటు పలికింది. .

● బాలనరసింహులు, రైతు సంఘం నాయకులు, పెద్దకంబలూరు

ఘనంగా సెమీ క్రిస్మస్


ప్రార్థనలో కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని సీఎస్ ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిని అందంగా అలంకరించి, కేకు కట్‌చేసి సంబరాలు చేపట్టారు. కొలిమిగుండ్ల మండల రెవరెండ్ పాస్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కొవ్వొత్తులను ప్రదర్శించారు. అనంతరం క్రిస్మస్‌కు ముందు జరుపుకునే సెమీ క్రిస్మస్ వేడుకల ప్రాధాన్యతను పాస్టర్ శ్రీదేవి భక్తులకు వివరించారు. సంఘ పెద్దలు, క్రైస్తవులు, చిన్నారులు పాల్గొన్నారు.

కనకాద్రిపల్లెలో ఉద్రిక్తత

● కొడుకునూ కలిసేందుకు వచ్చిన తండ్రి

● అడ్డుకున్న బంధువులు, గ్రామస్థులు

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన పుచ్చా మల్లారెడ్డి కుమార్తె మూడేళ్లుగా భర్త యజ్ఞతేజారెడ్డితో నెలకొన్న వివాదం కారణంగా కుమారుడితో కలిసి పుట్టింట్లో ఉంటోంది. యజ్ఞతేజారెడ్డి తన భార్య వద్ద ఉన్న కుమారుడిని చూడటానికి కోర్టు అనుమతి ఉందంటూ మరికొంత మందితో కలిసి ప్రత్యేక వాహనంలో ఆదివారం గ్రామా నికి వచ్చాడు. ఈనేపథ్యంలో కుమారుడిని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారంటూ సదరు మహిళ బంధువులు, స్థానికులు అడ్డుకున్నారు. వివాదం పెద్దది కావడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు గ్రామానికి చేరుకొని పర్థితిని సమీక్షించారు. సున్నితమైన కుటుంబ విషయం కావడంతో విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

'అల్ట్రాటెక్'లో జార్ఖండ్ కార్మికుడు మృతి

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట్నీకోట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అల్ట్రాటెక్ పరిశ్రమలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రం గర్వా జిల్లా తెనార్ గ్రామానికి చెందిన బిరేంద్ర ప్రజాపతి(50) బతుకు దెరువు నిమిత్తం అల్ట్రాటెక్ పరిశ్రమ కొచ్చి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఆకస్మాత్తుగా అపస్మారక స్థితిలో పడివున్న బిరేంద్ర ను తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.